క్లుప్తంగా

ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోండి



భూ రికార్డులను చూపుతున్న బాధితుడు దివాకర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: ఫేక్ పాసు పుస్తకాలు సృష్టించి తన భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తూ బెదిరిస్తున్న లీలాకృష్ణపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని అప్పలవంకకు చెందిన బాధితుడు దివాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. రామచంద్రాపురం మండలం, అనుపల్లి గ్రామ లెక్క దాఖలాలోని 2 ఎకరాల 31 సెంట్లు భూమి గత 80 ఏళ్లుగా తమ ఆధీనంలో ఉందని తెలిపారు. ఈ భూమిలో అన్యాయంగా, అక్రమంగా లీలాకృష్ణ, అతని అన్న సుదర్శన ఆచారి పేర్లతో ఇద్దరూ కలిసి ఇరువురు 38.5 సెంట్లు చొప్పున 77 సెంట్లకు నకిలీ పాసుపుస్తకాలు సృష్టించుకున్నారని తెలిపారు. అంతేకాక ఈ భూమి తమదేనని బెదిరిస్తున్నారని వాపోయారు. భూమి కబ్జా చేసేందుకు ప్రయత్నించడమేకాక తాము ఎదురు తిరగడంతో డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. బాలచంద్రారెడ్డి, వై.వాసుదేవ రెడ్డి, జి.పాపిరెడ్డి పాల్గొన్నారు.

నీటి ట్యాంకర్, జామెట్రీ బాక్సుల వితరణ



వాటర్ ట్యాంకర్‌తో పాటు విద్యాసామగ్రిని విరాళంగా అందజేస్తున్న దాతలు

చంద్రగిరి: మండల పరిధిలోని కొటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు లోకశాంతి అభివృద్ధి సేవా సంఘం సభ్యులు నీటి ట్యాంకర్, విద్యార్థులకు జామెట్రీ బాక్సులను విరాళంగా అందజేశారు. గురువారం పాఠశాలకు చేరుకున్న సభ్యుడు పురోహితులు ద్వారకనాథ్ స్వామి రూ.17 వేలు విలువ చేసే విద్యాసామగ్రితో పాటు వాటర్ ట్యాంక్‌ను అందజేశాడు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కేశవులతో పాటు ఉపాధ్యాయులు దాతలను సత్కరించారు.

డాక్టరేట్ ప్రదానం



జి.సుప్రియ యాని

తిరుపతి రూరల్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం న్యాయ శాస్త్ర విభాగపు పరిశోధక విద్యార్థిని కుమారి జి.సుప్రియయానికి డాక్టరేట్ అందజేశారు. న్యాయ శాస్త్ర విభాగపు అసోసియేట్ ప్రొఫెసర్ డా.ఎస్.మాధురి పరదేశి పర్యవేక్షణలో «ఏ స్టడీ ఆన్ ది హ్యూమన్ రైట్స్ ఆఫ్ విమెన్ ప్రిసనర్స్ విత్ రిఫరెన్స్ టు స్పెషల్ ప్రిజన్ ఫర్ విమెన్ రాజమండ్రి» అనే అంశంపై పరిశోధనా గ్రంథాన్ని సుప్రియ యాని సమర్పించారు. అందుకుగాను ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



రాస్తారోకో చేపడుతున్న అంగన్‌వాడీలు

తిరుపతి కల్చరల్: అంగన్‌వాడీలకు ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌ను రద్దు చేయాలని, వేతనాలు పెంచి కనీసం రూ.26 వేలు జీతం ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజమ్మ, జయప్రభ, సీఐటీయూ నేత వేణుగోపాల్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీల అఖిల భారత కమిటీ పిలుపు, సీఐటీయూ పిలుపు మేరకు గురువారం సాయంత్రం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి అంగన్‌వాడీలకు వేతనాలు పెంచడం లేదన్నారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, మినీలను మెయిన్ వర్కర్లుగా మార్చుతూ జీఓ ఇవ్వాలని, గ్రాట్యూటీ జీఓలో మార్పులు చేయాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లకు గైడెన్స్ రూపొందించాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. సీఐటీయూ నేతలు బుజ్జి, అంగన్‌వాడీ నేతలు గీత, వరలక్ష్మి, గోమతి, సుజిత, వెంకటలక్ష్మి, రాజేశ్వరి, ఎల్లమ్మ, యువరాణి, రోజా తదితరులు పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు మధుసూదన్‌రావు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు కొత్త ట్యాబులు ఇవ్వాలని, ఎఫ్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని, మినీ వర్కర్స్‌ను మెయిన్ వర్కర్స్‌కు ఇచ్చిన జీఓలో ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని కోరారు. అలాగే వేతనాలు పెంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దామలచెరువు అంగన్‌వాడీ కార్యకర్తలు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి మెట్టు వ్యాపారుల వినూత్న నిరసన

- వెంకన్నకు వేడుకోలు పేరిట తలనీలాల సమర్పణ
- నిరవధిక దీక్షలకు ఏడాది పూర్తి

తిరుపతి అన్నమయ్య సర్కిల్: సమస్యల పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన శ్రీవారి మెట్టు వ్యాపారుల నిరవధిక నిరసన దీక్షలకు గురువారంతో ఏడాది పూర్తయింది. స్థానిక టీటీడీ పరిపాలనా భవనం ఎదురుగా కొనసాగుతున్న ఈ దీక్షలు 365 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా చిరు వ్యాపారులు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కోరుతూ చిరు వ్యాపారుల కుటుంబాలకు చెందిన వారు సామూహికంగా తలనీలాలు సమర్పించారు. శ్రీవారి నిలువెత్తు చిత్రపటం ముందు గోవింద నామస్మరణ చేస్తూ, న్యాయం చేయమని టీటీడీకి విజ్ఞప్తులు చేస్తూ నినాదాలు చేశారు. తలనీలాలు సమర్పించిన అనంతరం కపిలతీర్థానికి వెళ్లి స్నానాలు ఆచరించారు.



టీటీడీ పరిపాలనా భవనం వద్ద నిరవధిక నిరసన దీక్ష

ఏడాది పూర్తయినా కనికరం లేదా...

దీక్షలు చేపట్టి ఏడాది పూర్తయినా టీటీడీ యాజమాన్యానికి చిరు వ్యాపారులపై కనికరం లేకపోవడానికి కారణం ఏమిటో చెప్పాలని శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల యూనియన్ గౌరవాధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. శ్రీవారి మెట్టు వ్యాపారుల నిరసన శిబిరం వద్ద ఆయన తన మద్దతు ప్రకటించి, మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా సామాన్యుడికి టీటీడీలో న్యాయం అందకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ శ్యామలరావు, అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరిలను కలిసినా, పలుమార్లు చర్చలు జరిపినా సమస్యలను ఎందుకు పరిష్కరించలేదో సమాధానం చెప్పాలన్నారు. రోజురోజుకు పోరాటం మరింత ఉధృతం అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వ పెద్దల గౌరవం పలుచబడక ముందే సామరస్యంగా సమస్యను పరిష్కరించాలన్నారు. పీ ఫోర్ పథకం పేరిట చంద్రబాబు బంగారు కుటుంబాలను ఆదుకుంటామని చేస్తున్న ప్రకటనలలో వాస్తవం ఎంతో ఇలాంటి ఘటనలతో అర్థమవుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర అధ్యక్షతన జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ నేతలు టి.సుబ్రహ్మణ్యం, ఆర్.లక్ష్మి, కె వేణుగోపాల్, మాధవ్, బుజ్జి, తంజావూరు మురళి, రవి, మారి ముత్తు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి సాయిలక్ష్మి మద్దతు ప్రకటించారు. శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల యూనియన్ నాయకులు మధు, చిట్టిబాబు, యుగంధర్, గణేష్, రాంబాబు రామ్మూర్తి, మల్లి, నరసింహులు, ప్రకాష్, సోనూ, పెంచలయ్య, మునయ్య, చిరంజీవి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఇలాకాలో డిగ్రీ కాలేజీకి దిక్కు లేదు

చంద్రగిరి: సీఎం చంద్రబాబు సొంత మండలం చంద్రగిరిలో ఇప్పటి వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందని, తక్షణమే ప్రభుత్వం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం నేతలు డిమాండ్ చేశారు. చంద్రగిరి మండలంలో విద్యారంగ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ముందుగా విద్యార్థులతో కలసి పట్టణంలో ర్యాలీ చేపట్టి, తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి భగత్‌రవి, జిల్లా ఉపాధ్యక్షుడు జి.తేజ మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ప్రస్తుత మంత్రి నారా లోకేష్ హాస్టళ్లను పరిశీలించి, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారన్నారు. ఇప్పుడు ఆయన విద్యాశాఖ మంత్రిగా ఉండి ఒక్క సమస్యను కూడా పరిష్కరించకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. పైగా సమస్యలను ఎత్తిచూపిన విద్యార్థి సంఘాలపై చీకటి జీఓలతో అడ్డుకునే ప్రయత్నం చేయడం ఘోరమన్నారు. విద్యార్థి లోకం ఎదురు తిరిగితే రాష్ట్రంలో ఏ పార్టీ అయినా తుడుచుపెట్టుకుపోవాల్సిందేననే విషయం గుర్తు పెట్టుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థుల చదువులు సజావుగా సాగడం లేదని విమర్శించారు. చంద్రగిరిలో ప్రభుత్వ హాస్టళ్లలో సమస్యల కారణంగా జూనియర్ కళాశాల అడ్మిషన్లు కూడా తగ్గిపోయాయని తెలిపారు. ఎస్సీ హాస్టళ్లకు స్థలం కేటాయించినప్పటికీ ఇప్పటివరకు సొంత భవనాలు నిర్మించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ప్రభుత్వంపై విద్యార్థి సంఘాలు తీవ్ర పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ముకేశ్, చందు, రఘు, తేజ, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని నిరసన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం నేతలు

భక్తిశ్రద్ధలతో చవితి వేడుకలు

తిరుపతి తుడా: వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో బ్రహ్మాండంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని, వినాయక సాగర్‌లో నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో వినాయక చవితి నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, వరసిద్ధి వినాయక నిమజ్జన కమిటీ సభ్యులతో ఆమె సమావేశమయ్యారు. వినాయక చవితి, నిమజ్జనంలో ఆయా విభాగాల అధికారులు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో విగ్రహాలు ఏర్పాటు చేసేవారికి అన్ని అనుమతులు పొందేందుకు సింగిల్ విండో సిస్టమ్ ఏర్పాటు చేశామని, త్వరగా అనుమతులు పొందవచ్చన్నారు. విగ్రహాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల నుండి వినాయక సాగర్ కు వెళ్ళే మార్గాల రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఆయా మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఇబ్బంది లేకుండా పాండ్‌లో నీరు నింపాలని, ర్యాంప్ ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు క్రేన్లు ఏర్పాటు చేయాలని, పరిసర ప్రాంతాలను ఏపటికప్పుడు శుభ్రం చేయించాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా ఎక్కువ వెలుగులు వచ్చేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. బోట్లు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని ఫైర్, మత్స్య శాఖ అధికారులను ఆదేశించారు. నిమజ్జనం రోజు మద్యం దుకాణాలు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు. మండపాల వద్ద సినిమా పాటలు, అశ్లీల నృత్యాల ప్రదర్శనలు లేకుండా చూడాలన్నారు. ఊరేగింపులో డీజే సౌండ్లు లేకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. 108 వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్రనాయుడు, తుడా సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్, ఈఈ రవీంద్ర, పోలీసు, పలు విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న కమిషనర్

అంటు వ్యాధులు ప్రబలకుండా చూడండి

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండల పరిధిలో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. గురువారం దామినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్య ఆరోగ్య సిబ్బందితో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున పల్లెల్లో వర్షపునీటికి మురుగునీరు కలసి దోమలు స్వైర విహారం చేస్తున్నాయన్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో ప్రజలు విష జ్వరాలు బారిన పడుతున్నారని తెలిపారు. జ్వరాల వ్యాప్తి, నియంత్రణకు జాగ్రత్తలపై ప్రజలకు తెలియపరచాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బందికి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై ఏఎన్‌ఎంలు ఏకరువుపెట్టారు. ప్రభుత్వం అందించే జీతాలతో తాము ప్రతి రోజు గ్రామాల్లో పర్యటించలేకున్నామని, అలవెన్స్‌లు ఇవ్వడం లేదని చెప్పారు. ఈ వ్యవహారంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో చర్చించి అందరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రామచంద్ర, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉదయశ్రీ, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సుకన్య, సిబ్బంది పాల్గొన్నారు.



ఏఎన్‌ఎంల సమస్యలు వింటున్న ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర

దామినేడు పీహెచ్‌సీలో ఆకతాయిల ఆగడాలు

తిరుపతి రూరల్: తిరుచానూరు పంచాయతీ దామినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకతాయిల ఆగడాలు అధికమవుతున్నాయని, రాత్రివేళ ఆస్పత్రి ఆవరణలోనే మద్యం, గంజాయి తాగి బీభత్సం సృష్టిస్తున్నారని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉదయశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆస్పత్రిలో హెచ్‌డీఎస్(హాస్పిటల్ డెవలప్‌మెంట్ సర్వీసెస్) కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ కన్వీనర్‌గా ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, సభ్యులుగా ఉన్న ఎంపీడీఓ, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు. మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ పీహెచ్‌సీ భవనం వద్ద మద్యం, గంజాయి మత్తులో ఆస్పత్రి కిటికీలు, విద్యుత్తు జంక్షన్ బాక్సులను బద్దలు కొడుతున్నారన్నారు. తిరుచానూరు పోలీసులకు చెప్పినా రాత్రివేళ గస్తీకి రావడం లేదన్నారు. దీనిపై కమిటీ సభ్యులు మాట్లాడుతూ జిల్లా ఎస్పీని కలిసి దామినేడు హౌసింగ్ కాలనీలో పోలీస్ అవుట్‌పోస్ట్ ఏర్పాటు చేయించేలా విజ్ఞప్తి చేయాలని నిర్ణయించారు.



సమావేశమైన హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు

వ్యర్థాలు బయటకు రాకుండా చూసుకోండి

- మదర్ డెయిరీ నిర్వాహకులతో ఎంపీపీ, ఎంపీడీఓ సమీక్ష

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ పరిధిలోని మదర్‌డెయిరీ (పాల పదార్థాల ఉత్పత్తి కేంద్రం) నుంచి వచ్చే కలుషిత నీరు కట్టడిపై అధికారులు ప్రజా ప్రతినిధుల్లో ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఈనెల 8వ తేదీన 'పాల కూట విషం' శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఆ మేరకు మండల స్థాయి అధికారులు పంచాయతీ నుంచి సదరు ఫ్యాక్టరీ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినప్పటికీ వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర, ఎంపీటీసీ జయకర్, సర్పంచ్ లక్ష్మీ భర్త మన్నూరు శివ గురువారం ఆ ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నారు. ఫ్యాక్టరీ ఆవరణలో నెలల తరబడి నిల్వ ఉన్న నీటిని గమనించి ఆపై ఫ్యాక్టరీ పరిపాలనా విభాగానికి చేరుకుని అక్కడి సిబ్బందితో సమావేశమయ్యారు. మదర్ డెయిరీ నుంచి కలుషిత నీరు బయటకు రావడంతో పరిసరాలన్నీ విషపూరితమవుతున్నాయన్న ఫిర్యాదులు ప్రజల నుంచి వచ్చినందున జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డెయిరీ హెడ్ కేఎల్‌రెడ్డి, ప్లాంటు ఇన్‌చార్జి శ్రీహరి కల్పించుకుని తమ ఫ్యాక్టరీ నుంచి విడుదలయ్యే నీరు ఎక్కడా బయటకు రావడం లేదని, అదంతా వర్షపునీరు అని తెలిపారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే నీటిని శుద్ధి చేయడానికి నీటి శుద్ధి యంత్రాల ఏర్పాటు కోసం అనుమతులు రాగానే నిర్మిస్తామన్నారు. వర్షపునీరు బయటకు పంపడానికి ప్రభుత్వ ఇంజినీర్లను పంపి ప్రణాళికలు సిద్ధం చేయిస్తామని, దానికి అయ్యే ఖర్చు ఫ్యాక్టరీ తరఫున భరించాలని ఎంపీడీఓ రామచంద్ర సూచించడంతో అందుకు వారు అంగీకరించారు.



మదర్ డెయిరీ ఆవరణలో నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ తదితరులు

సచివాలయ సెక్రటరీలకు మరోసారి నోటీసులు

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 67 వార్డు సచివాలయాల పరిధిలోని 600 మందికి పైగా సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు అదనపు కమిషనర్ చరణ్ తేజ రెడ్డి గురువారం ఈ నోటీసులను జారీ చేశారు. సచివాలయ సెక్రటరీలు కౌశలం సర్వే రోజువారీ టార్గెట్ పూర్తి చేయకపోవడంతో నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. గత వారం హర్ ఘర్ తిరంగా ర్యాలీకి హాజరు కానీ 381 మంది సెక్రటరీలకు నోటీసులు జారీ చేయగా, సర్వే నిర్వహణలో నిర్లక్ష్యం చేశారంటూ ఏకంగా 600 మందికి పైగా సెక్రటరీలకు నోటీసులు ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. దీనిపై శుక్రవారం కమిషనర్ మౌర్యను సచివాలయ సెక్రటరీలు కలవనున్నారు.

అడ్మిషన్ల గడువు పెంపు

తిరుపతి సిటీ: ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులలో ప్రవేశాల గడువును పొడిగిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈఓ కేవీఎన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఆర్టీసీ బస్సు కిందపడి యువకుడికి గాయాలు

తిరుపతి క్రైమ్: ఆర్టీసీ బస్సు కిందపడి యువకుడికి గాయాలైన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. వెస్ట్ సీఐ మురళీమోహన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హరి ప్రకాష్(28) సొంత పనులు ముగించుకొని ఇంటికి వెళ్లే క్రమంలో స్విమ్స్ ఆస్పత్రి వద్ద కుడివైపు సిగ్నల్ వేసుకొని వెళ్తుండగా వెనక వైపు నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో హరి ప్రకాష్ కాలికి తీవ్రమైన గాయం కావడంతో రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బస్సు డ్రైవర్ ప్రస్తుతం పరారీలో ఉన్నారు.

కూటమికి పేదలపై శ్రద్ధ లేదు

తిరుపతి కల్చరల్: టీడీపీ కార్యాలయానికి భూమి ఇచ్చేందుకు పెట్టిన శ్రద్ధ శెట్టిపల్లి పేదలపై కూటమి ప్రభుత్వం చూపకపోవడం విడ్డూరమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి తెలిపారు. తక్షణం శెట్టిపల్లిలోని పేదల భూముల సమస్యలను పరిష్కరించే చర్యలు తీసుకోవాలని కోరారు.

మాలతీ చందూర్ రచనలు సజీవ సాక్ష్యాలు

తిరుపతి రూరల్ : ప్రముఖ రచయిత డాక్టర్ మాలతీ చందూర్ స్మారక ధర్మనిధి సదస్సు గురువారం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మహిళా విశ్వవిద్యాలయం డీన్ ఎస్ఎస్ఎస్‌హెచ్‌ఎమ్ ఆచార్య సి.వాణి మాట్లాడుతూ తెలుగు అధ్యయన శాఖ ప్రతి సంవత్సరం నిబద్ధతతో ఏర్పాటు చేసే కార్యక్రమాలలో డాక్టర్ మాలతీ చందూర్ స్మారక ధర్మనిధి సదస్సు ముఖ్యమైనదన్నారు. మాలతీ చందూర్ నవలలు, వంటలు - పిండి వంటలు తదితర రచనలు తమకు ఎంతో ఇష్టమన్నారు. , మాలతీ చందూర్ రచనలు - స్త్రీ ఔన్నత్యం అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన తెలుగు, లా, ఎడ్యుకేషన్, హోం సైన్స్, ఫార్మసీ వంటి వివిధశాఖల విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. సదస్సు సంచాలకులు డా.వై.సుభాషిణి, ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, ఆచార్య టి.భారతి, కె.ఎ.మునిసురేష్ పిళ్లై, డా.జి.శైలమ్మ, డా.డి.యువశ్రీ పాల్గొన్నారు.



మాలతీ చందూర్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు

సంగీత విద్వాంసుడికి సత్కారం

తిరుపతి కల్చరల్: పాండిచ్చేరి ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న తిరుపతికి చెందిన ప్రముఖ సంగీత విద్వాంసుడు వీఎస్ భరద్వాజ్‌ను వారి శిష్య బృందం గురువారం ఘనంగా సత్కరించి, అభినందించారు. బత్తిరెడ్డి, కన్నప్పగారి కేశవులు, చంద్రబాబు నాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపాలాచారి, వెంకటాద్రి, రామలింగేశ్వరకుమార్, ప్రదీప్, రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, మధుసూదన్, సంతోష్, యువరాజు, శోభారాణి పాల్గొన్నారు.



సంగీత విద్వాంసుడు భరద్వాజ్‌ను సత్కరిస్తున్న శిష్య బృందం

నోటీస్ బోర్డు

- శ్రీకపిలేశ్వరాలయంలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గణపతి పూజ, లక్ష కుంకుమార్చన.
- ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 11 గంటలకు కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చింతా మోహన్ మీడియా సమావేశం.
- కచ్చపి ఆడిటోరియంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా, నెల్లూరు, అనంతపురం , కడప, కర్నూలు జిల్లాల సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో ఆ శాఖ మంత్రి రీజనల్ స్థాయి సదస్సు.
- భారతీయ విద్యాభవన్‌లోని ఆడిటోరియంలో సాయంత్రం 5 గంటలకు సంగీత లహరి నిర్వహణ.

బాలికల స్కూల్లో ఆకస్మిక తనిఖీ



స్కూల్ రికార్డులను తనిఖీ చేస్తున్న గౌరీ శంకర్

చంద్రగిరి: స్థానిక ప్రభుత్వ శ్రీపద్మావతి బాలికల ఉన్నత పాఠశాలలను తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ గౌరీశంకర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో సదుపాయాలతో పాటు అభివృద్ధి పనులను పరిశీలించారు. విద్యార్థులు ఆటలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యాలయంలోని పలు రికార్డులను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎంఈఓలు లలిత కుమార్, భాస్కర్ బాబు, హెచ్ఎం వెంకటరమణ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరిట్ లిస్టుపై ఫేక్ వార్తలు నమ్మొద్దు

తిరుపతి సిటీ: డీఎస్సీ అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారంటూ మెరిట్ లిస్ట్ విడుదలైనట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని, వాటిని అభ్యర్థులు నమ్మవద్దని డీఈఓ కేవీఎన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి మెరిట్ లిస్ట్ విడుదల కాలేదని స్పష్టం చేశారు. ఇలాంటి ఫేక్ వార్తలతో అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వికసిత్ భారత్‌పై సదస్సు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని అన్నారావు సభా భవనంలో గురువారం వికసిత్ భారత్ నిర్మాణంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారతీయ రాష్ట్రీయ మహాసంఘ్ జాతీయ కార్యదర్శి గుంట లక్ష్మణ్ 2020 న్యూఎడ్యుకేషన్ పాలసీతోపాటు పలు అంశాలను తెలియజేశారు. వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి, ఏబీఆర్‌ఎస్‌ఎం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి, గణపతి భట్, ప్రొఫెసర్ సత్యనారాయణ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు



పుట్టినరోజు వేడుకల్లో ఎంపీటీసీ నరేష్ రెడ్డి

చంద్రగిరి: తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి సోదరుడు, తిరుపతి రూరల్ పార్టీ ఉపాధ్యక్షుడు, తిరుచానూరు ఎంపీటీసీ నరేష్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అభిమానుల మధ్య ఆయన కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రారెడ్డి, పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.